RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:252 శనివారం 31 అక్టోబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

గ్యాస్ కొరతపై తప్పుడు ప్రచారం

- ఎరువులు, వంటగ్యాస్ కొరతపై ప్రతిపక్షాలది దుష్ప్రచారమన్న మోదీ
- రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని విమర్శ
- రైతులపై భారం పడకుండా ఎరువుల ధరల నియంత్రణకు చర్యలు
- 26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ



4



చమోలీలో హెలికాప్టర్ కుప్పకూలినట్లు అనుమానం

- ఫాటా నుంచి బద్రీనాథ్ వెళ్తుండగా ప్రమాదం
- ఐదుగురు ప్రయాణికులు, పైలట్ ఉన్నట్లు గుర్తింపు
- శకలాల కోసం కొనసాగుతున్న గాలింపు

4

ఓటు హక్కు పరిరక్షణకు

రాంలీలా మైదాన్‌లో ర్యాలీ

- నవంబర్ 1న ఇండియా కూటమి భారీ నిరసన కార్యక్రమం
- 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ అంచనా
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని అడ్డుకుంటున్నారని అమిత్ షాపై రాహుల్ ఆరోపణ



4

రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానివే



- "భూకబ్జాలపై పోరాడినందుకే నన్ను జైలుకు పంపారు"
- సుప్రీం తీర్పుపై రేవంత్‌రెడ్డి హర్షం
- కేసీఆర్, కేటీఆర్‌పై సీఎం తీవ్ర ఆరోపణలు
- మూడేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల భూములకు రక్షణ
- భూముల విక్రయ ఆదాయం విద్య, వైద్యం, సాగునీటికే

హైదరాబాద్, అక్టోబర్ 30:

మియాపూర్‌లోని రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విలువైన భూములను కబ్జా చేసేందుకు కుట్రలు జరిగాయని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా భూకబ్జాలపై పోరాడినందుకే తనపై కక్షగట్టి జైలుకు పంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించడం వల్లే అనుకూల తీర్పు వచ్చిందన్నారు. భూముల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు

మిగతా 3వ పేజీలో..

ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్



- నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ
- మూసీ పునరుజ్జీవం, ఆరఆరఆర్, ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్‌కు కొత్త రూపు
- రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ప్రగతిలో భాగస్వామి కావాలి
- నారెడ్కో ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 30 :

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాక సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు వివిధ ప్రాంతాల

మిగతా 3వ పేజీలో..

సింగరేణి కార్మికులకు మరో శుభవార్త

- 5న సింగరేణి దీపావళి బోనస్ చెల్లింపు
- దీపావళి శుభాకాంక్షలతో వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి
- ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చెల్లింపు
- దాదాపు 38 వేల మంది కార్మికులకు అందనున్న బోనస్

3

విద్యుత్ ఉద్యోగులకు డీఏ, డీఆర్ పెంపు

3

- విద్యుత్తు సంస్థల సీఎండీలను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి
- 19.272 నుంచి 21.815 శాతానికి పెంపు.. జూలై 1 నుంచి వర్తింపు
- 71,360 మందికి ప్రయోజనం.. నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం

దానం నాగేందర్ మా అభ్యర్థి

- ఎన్నికలేవైనా సీరియస్‌గానే తీసుకుంటా
- కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు
- కాళేశ్వరంపై నిపుణుల సూచనల మేరకే నిర్ణయాలు
- హైదరాబాద్ ట్రాఫిక్‌కు వన్‌వేనే పరిష్కారం: సీఎం రేవంత్ రెడ్డి
- మెట్రో రుణంపై కేంద్రం తీరుపై అసంతృప్తి



2





మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- నాడు కేసీఆర్ దృఢనిశ్చయంతో వ్యవహరించారు
- అన్ని వివరాలు సుప్రీంకోర్టు రికార్డుల్లో స్పష్టంగా వున్నాయి
- సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ ఈకేసు వాదించారు
- ఈ భూములను తెగనమ్మే కుట్రకు తెర లేపారు
- మాజీ మంత్రి హరీష్ రావు

2

ఆహార తయారీ కేంద్రాలపై కొరడా

- హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో 20 యూనిట్లలో తనిఖీలు
- అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాల తయారీ
- తొమ్మిది సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు సస్పెండ్
- రూ.5.89 లక్షల విలువైన 5,555 కిలోల సరుకులు సీజ్
- కల్తీ అనుమానంతో 21 ఆహార నమూనాలు ల్యాబ్‌కు

2





నిమ్స్‌లో ఏసీబీ సోదాలు పూర్తి

- అర్ధరాత్రి 2 గంటల వరకు కొనసాగిన తనిఖీలు
- డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ అరెస్టు నేపథ్యంలో దర్యాప్తు
- బినామీల నివాసాల్లోనూ ఏసీబీ బృందాల సోదాలు
- సెక్యూరిటీ, మెడిసిన్, క్యాంటీన్ టెండర్లలో అక్రమాలపై ఆరా

2

ఒమేగా ఆసుపత్రులపై ఐటీ దాడులు

- దేశవ్యాప్తంగా 24 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- తెలంగాణ, ఏపీ సహా ఐదు రాష్ట్రాల్లో సోదాలు
- ఆసుపత్రుల ఆర్థిక లావాదేవీలు, బిల్లింగ్ రికార్డుల పరిశీలన
- పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో పత్రాలు, డిజిటల్ ఆధారాల సేకరణ

2





ఇంద్రవెల్లి పాపం కాంగ్రెస్ దే

- పంట వేయొద్దన్న సీఎం అధికారంలో వుండొద్దు
- జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరివ్వని బీఆర్ఎస్
- చనఖా–కొరటా ప్రాజెక్టులో భారీ అవినీతి
- సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిస్తున్నాం
- రెండు ఎమ్మెల్సీ స్థానాలకు బీసీలనే నిలబెట్టాం
- ఆదిలాబాద్ పాంచజన్య సభలో కవిత

2



చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో విద్యార్థుల పార్టీపై పోలీసుల దాడి

- ఎల్జీ ఫామ్‌హౌస్‌లో ఎస్ఓటీ, చేవెళ్ల పోలీసుల ఆకస్మిక తనిఖీలు
- ఐజీఎస్ ఇక్ఫాయ్ యూనివర్సిటీ విద్యార్థులే నిర్వాహకులుగా అనుమానం
- మద్యం, మత్తు పదార్థాల వినియోగంపై పోలీసుల ఆరా

2



చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో విద్యార్థుల పార్టీపై పోలీసుల దాడి

చేవెళ్ల, అక్టోబర్ 30:

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ఓ ఫామ్‌హౌస్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న పార్టీపై పోలీసులు దాడి చేశారు. కమ్మెట గ్రామ శివారులోని ఎల్జీ ఫామ్‌హౌస్‌లో స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌వోటీ), చేవెళ్ల పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి 40 మందికి పైగా విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిలో 20 నుంచి 25 మంది యువతులు ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. శంకరపల్లి మండలం దొంతన్‌పల్లి పరిధిలోని ఐబీఎస్ ఇక్ఫాయ్ యూనివర్సిటీకి చెందిన బీబీఏ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ పార్టీ ఏర్పాటు చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. పోలీసులను గమనించిన కొందరు విద్యార్థులు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించినప్పటికీ, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

అనంతరం విద్యార్థులను చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరిస్తున్నారు. పార్టీలో మద్యం అక్రమంగా సరఫరా చేశారా? నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించారా? అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఫామ్‌హౌస్ యజమాని అనుమతులు, పార్టీ నిర్వహణకు సంబంధించిన వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. విచారణ పూర్తయితేనే ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.





ఒమేగా ఆసుపత్రులపై ఐటీ దాడులు

హైదరాబాద్, అక్టోబర్30:

ప్రముఖ క్యాన్సర్ చికిత్సా సంస్థ ఒమేగా హాస్పిటల్స్‌పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. దేశవ్యాప్తంగా ఆ సంస్థకు చెందిన 24 ప్రాంతాల్లో ఆసుపత్రుల శాఖలు, యాజమాన్య కార్యాలయాలు, నివాసాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ ఇన్వెస్టిగేషన్ వింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ఒమేగా ఆసుపత్రుల్లో అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా ఆసుపత్రుల పరిపాలనా విభాగాలు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కార్యాలయాల్లో రికార్డులను పరిశీలిస్తున్నారు. సంస్థకు చెందిన కీలక వైద్యులు, యాజమాన్య ప్రతినిధుల నివాసాల్లోనూ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. పన్ను ఎగవేత, అనధికార నగదు లావాదేవీలపై వచ్చిన సమాచారంతో ఈ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. తనిఖీల్లో భాగంగా పలు పత్రాలు, బ్యాంకు లావాదేవీల వివరాలు, డిజిటల్ హార్డ్ డిస్కులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆసుపత్రుల ఖాతాల పుస్తకాలు, బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లోని సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోదాలు పూర్తయిన తర్వాత ఐటీ శాఖ అధికారికంగా వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

నిమ్స్‌లో ఏసీబీ సోదాలు పూర్తి

హైదరాబాద్:

నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) చేపట్టిన విస్తృత తనిఖీలు ముగిశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌ను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన అధికారులు, ఆమె వ్యవహారాలపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు 20 మంది సభ్యులతో కూడిన ఏసీబీ బృందాలు ఆసుపత్రిలో అర్ధరాత్రి 2 గంటల వరకు సోదాలు నిర్వహించాయి.

తనిఖీల సందర్భంగా నిమ్స్‌లోని వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. లక్ష్మీభాస్కర్‌కు బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తుల నివాసాల్లోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఆమె డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన సమయంలో జరిగినట్లు భావిస్తున్న ఆర్థిక అక్రమాలపై ఆధారాలు సేకరించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో గతంలో కేటాయించిన పలు కాంట్రాక్టుల్లో లక్ష్మీభాస్కర్ పాత్రపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. సెక్యూరిటీ నిర్వహణ, మందుల పంపిణీ, మెడికల్ షాప్, క్యాంటీన్, సర్జికల్ విభాగానికి సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం సోదాలను ముగించారు. □□□□లో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



దానం నాగేందర్ మా అభ్యర్థి

హైదరాబాద్, అక్టోబర్ 30:

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ బరిలో ఉంటారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికలు చిన్నవైనా, పెద్దవైనా తాను అత్యంత సీరియస్‌గా తీసుకుంటానని అన్నారు. ఎన్నికలను తేలిగ్గా తీసుకుని ఉంటే ఈ స్థాయికి వచ్చేవాడిని కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వబోమని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన రాజకీయాలు, రాష్ట్ర అభివృద్ధి, కాళేశ్వరం ప్రాజెక్టు, హైదరాబాద్ ట్రాఫిక్, మెట్రో విస్తరణ తదితర అంశాలపై మాట్లాడారు.

కేసీఆర్ పాలనపై విమర్శలు

తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రాన్ని దోచుకున్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. ఆయన పాలనలో ఎంతో మంది పిల్లల జీవితాలు బలయ్యాయని ఆరోపించారు. ఆ పాపం కేసీఆర్‌ను వెంటాడుతుందని వ్యాఖ్యానించారు. గత పాలనలో జరిగిన అరాచకాలకు ప్రకృతి శిక్ష విధిస్తోందని, కేసీఆర్ రెండోసారి ఓడిపోవడంలోనూ ప్రకృతి తన పని తాను చేస్తుందని అన్నారు. ఇవి రాజకీయ విమర్శలేనని పేర్కొన్నారు.

మెట్రో రుణంపై కేంద్రం తీరుపై అసంతృప్తి

మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించే విషయంలో కేంద్రం సూచనల మేరకే ముందుకు వెళ్లామని సీఎం తెలిపారు. ఈ అంశంపై ఎల్‌అండ్‌టీతో ఒప్పందం చేసుకున్నామని, రుణం కోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి అనుమతి కూడా వచ్చిందని చెప్పారు. అయినప్పటికీ ప్రస్తుతం రుణం మంజూరును అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాము ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసిన వెంటనే కేటీఆర్ కూడా వచ్చి వారిని కలుస్తారని వ్యాఖ్యానించారు. మెట్రో విస్తరణ, రుణాల మంజూరు విషయంలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కాళేశ్వరంపై నిపుణులదే తుది మాట

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కేటీఆర్, హరీశ్‌రావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టుపై జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) విశ్లేషణ కొనసాగుతోందని తెలిపారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుల విషయంలో నిపుణుల సూచనల మేరకే తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులకు, నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చిన తర్వాత వర్తించే పరిధులకు మధ్య తేడా ఉంటుందని వివరించారు. కాళేశ్వరం విషయంలో నిపుణుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్రంలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏదైనా సమస్య తనకు పూర్తిగా అర్థమైతే దాని పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులకు సైతం కీలక పదవులు కల్పించామని చెప్పారు. తాను ఎవరికో అనుకూలంగా పనిచేసే వ్యక్తిని కాదని, తనదైన విధానంలో వ్యవహరిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనను తాను ప్లెయిన్ పేపర్‌తో పోల్చుకున్నారు. ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే తమ కుటుంబం ఆర్థికంగా బాగుందని, తాను కేసీఆర్ కంటే శ్రీమంతుడినని వ్యాఖ్యానించారు.

అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు?

అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ నేతలు హాజరుకాకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. కీలక అంశాలపై చర్చించాల్సిన సమయంలో గందరగోళం సృష్టించి బయటకు వెళ్తున్నారని విమర్శించారు. రాజకీయాలను, అభివృద్ధిని తాను ఎప్పుడూ కలిపి చూడనని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేకపోయిన పనులను తమ ప్రభుత్వం చేపడుతుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్‌కు వన్‌వే

హైదరాబాద్‌లో కేబీఆర్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాలనే ఉద్దేశంతో వన్‌వే విధానం అమలు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే చివరకు ట్రాఫిక్ సమస్యకు వన్‌వే విధానమే పరిష్కారంగా మారిందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.

ఇంద్రవెల్లి పాపం కాంగ్రెస్ దే

ఆదిలాబాద్, అక్టోబర్ 30:

తెలంగాణ రక్షణ సేన పార్టీకి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ఆదివాసీల దీవెనలు ఉండాలని.. మీ ఆశీర్వాదం కోసమే ఈ జిల్లాకు వచ్చామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పాంచజన్య సంకల్ప సభల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి వద్ద నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి ఘటనను గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లి పాపం కాంగ్రెస్ పార్టీదేనని విమర్శించారు. పంటలు కాపాడుకునేందుకు మీటింగ్ పెట్టుకోవాలనుకున్న ఆదివాసీలను కనికరం లేకుండా పిట్టలను కాల్చినట్లు కాల్చి చంపింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.తెలంగాణ సాధించుకోని 12 ఏళ్లు అవుతున్న సరే ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధి లేదని, 750 ఊళ్లలో కనీసం స్కూల్స్ లేని పరిస్థితి ఉందన్నారు. తలసరి ఆదాయంలో ఆదిలాబాద్ జిల్లా చాలా వెనుకబడి ఉందని, ఈ ప్రాంతంలో రోడ్లు, ప్రాజెక్ట్ లు, అభివృద్ధిని అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీలు నిర్లక్ష్యం చేశాయన్నారు. 12 ఏళ్లుగా తుమ్మిడి హెట్టి ప్రాజెక్ట్ పేరుతో ఇక్కడి ప్రజలను బీఆర్ఎస్, కాంగ్రెస్ లు మురిపించాయే తప్ప చేసేందేమీ లేదన్నారు. కాగజ్ నగర్ లో కాగజ్ నగర్ లో లక్షా 5 వేల ఎకరాలకు నీళ్లు రావాల్సి ఉంటే 6 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారని ధ్వజమెత్తారు. ఏళ్లకు ఏళ్లుగా ప్రాజెక్ట్ లను పెండింగ్ పెట్టారన్నారు. తుమ్మిడి హెట్టిని పూర్తి చేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవని చెప్పారు. చరిత్రలో రైతులను పంటలు వేయవద్దని చెప్పిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనని కవిత అన్నారు. వ్యవసాయం మాత్రమే తెలిసిన రైతులను పంటలు వేయవద్దంటున్న ముఖ్యమంత్రి వారికి ఏ విధంగా న్యాయం చేస్తారో చెప్పాలని నిలదీశారు.ఇంద్రవెల్లి వీరులకు రూ. 25 లక్షలు ఇస్తామన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. ఇంద్రవెల్లి వీరులను కూడా మోసం చేసిన ఘనత కాంగ్రెస్ దేనని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాకు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఒక్క మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు.

ఆదిలాబాద్ లో బీఆర్ఎస్ గర్జన సభ నిర్వహిస్తామని చెబుతోందని, కానీ వారిది గర్జన కాదు, తర్జన భర్జన అని కవిత ఎద్దేవా చేశారు. పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్..పత్తి ఎక్కువగా పండే ఆదిలాబాద్ లో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేయకపోవటానికి కారణం ఏంటన్నారు. చనఖా కొరటా ప్రాజెక్ట్ లో భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని.. రూ. 368 కోట్ల ప్రాజెక్ట్ కాస్ట్ ను ఏకంగా 2100 కోట్లకు పెంచారని చెప్పారు. సామాజిక తెలంగాణ సాధించటమే టీఆర్ఎస్ లక్ష్యమని..ఆ లక్ష్యం దిశగా మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నామని కవిత చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు స్థానాలను తమ పార్టీ బీసీలకే ఇచ్చిందన్నారు. ఆదిలాబాద్ లోని ఇంద్రవెల్లి వద్ద నిర్వహించిన టీఆర్ఎస్ పాంచజన్య సంకల్ప సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ సభకు పెద్ద ఎత్తున ఆదివాసీలు, జిల్లా ప్రజలు తరలివచ్చారు. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదిలాబాద్ జిల్లాకు చేరుకోగానే ముందుగా ముత్నూర్ లో కొమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంద్రవెల్లిలోని అమరుల స్థూపం వద్ద నివాళులర్పించి ప్రత్యేక బస్సులో సభ ప్రాంగణానికి అభిమానుల కేరింతలు, నృత్యాలు, డప్పుల కొలహలం మధ్య ర్యాలీగా తరలి వెళ్లారు. దారి పొడువునా ఆదివాసీలు కవితకు స్వాగతం పలికారు.

మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

హైదరాబాద్ అక్టోబర్30:

బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడి కాపాడిన విలువైన ప్రభుత్వ భూమిని.. ఈ రోజు తాము అమ్ముకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రకటించడం సిగ్గు చేటని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. మియాపూర్ 550 ఎకరాల వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత, ముఖ్యమంత్రి మీడియా సమావేశం పెట్టి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని సుప్రీంకోర్టు రికార్డులే స్పష్టం చేస్తున్నాయి. మియాపూర్ భూ వివాదం 2003లోనే ఎస్ఎల్పీ గా సుప్రీంకోర్టుకు చేరింది. 2013లో అది సివిల్ అప్పీల్‌గా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఈ విలువైన భూమి ప్రభుత్వం చేజారిపోకూడదని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృఢ నిశ్చయంతో వ్యవహరించారు. 2015లోనే దేశంలోనే అత్యుత్తమ న్యాయవాదుల్లో ఒకరైన సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్‌ను ప్రత్యేకంగా నియమించారు. ఈ వివరాలన్నీ సుప్రీంకోర్టు రికార్డుల్లో స్పష్టంగా నమోదై ఉన్నాయి. ప్రజలందరికీ అందుబాటులోనూ ఉన్నాయి. సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్ 2015 ఏప్రిల్ 7 నుంచి తెలంగాణ ప్రభుత్వం తరపున మియాపూర్ భూముల రక్షణ కోసం సుప్రీంకోర్టులో వాదిస్తూ వచ్చారు. 2015 నుంచి 2023 వరకు దాదాపు 8 ఏళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూముల పరిరక్షణ కోసం అలుపెరగని న్యాయపోరాటం చేసింది. మియాపూర్ భూమికి సంబంధించిన ప్రతి పిటిషన్, ప్రతి అఫిడవిట్, సమగ్ర ఆధారాలను సుప్రీంకోర్టు ముందు ఉంచింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే. గౌరవ సుప్రీంకోర్టు మియాపూర్ భూముల తీర్పులో మియాపూర్ తీర్పుకు అసలు పునాది 'ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్' కేసు తీర్పేనని స్పష్టంచేసింది. గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు సంబంధించిన ఆ కేసు 2023 జూన్ 15న తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించింది. ఆనాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఆ కేసులోనూ ప్రభుత్వం తరపున వాదించింది అదే వైద్యనాథన్. నాడు మేము సాధించిన ఆ విజయమే, ఆ తీర్పులోని చట్టపరమైన అంశాలే నేడు మియాపూర్ భూముల తుది తీర్పుకు బలమైన ఆధారమయ్యాయి. ఈ రికార్డులన్నీ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో బహిరంగంగా ఉన్నప్పటికీ, తానే ఏదో సాధించినట్లు ముఖ్యమంత్రి ప్రెస్ మీట్లు పెట్టి సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదం, సిగ్గుచేటు.

ప్రెస్ మీట్ పెట్టి అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన అవి నిజాలు అయిపోవు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిరంతర పోరాటం వల్లే నేడు మియాపూర్ భూములు పరిరక్షించబడ్డాయని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశం వెనుక ఉన్న అసలు కుట్ర వేరే ఉంది. మియాపూర్‌లో ఉన్న ఈ 550 ఎకరాల భూమి విలువ రూ. 60 వేల కోట్ల పైమాటేనని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారు. ఈ విలువైన భూములను అమ్ముకోవడానికే ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు.విలువైన జాతి సంపదను ప్రజల భవిష్యత్తు అవసరాలకు ఉపయోగించకుండా తెగనమ్ముకునే కుట్రకు తెర లేపారని ఆరోపించారు.



ఆహార తయారీ కేంద్రాలపై కొరడా

హైదరాబాద్:

ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమిస్తున్న ఆహార తయారీ కేంద్రాలపై తెలంగాణ ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (TG SAFE) చర్యలు ముమ్మరం చేసింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 ప్రత్యేక బృందాలు హైదరాబాద్, వరంగల్, ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 20 తయారీ యూనిట్లపై ఒకేసారి దాడులు నిర్వహించాయి. మసాలాలు, వంట నూనెలు, పాల ఉత్పత్తులు, స్వీట్లు, శీతల పానీయాలు, బేకరీ పదార్థాల తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టగా అనేక ఉల్లంఘనలు బయటపడ్డాయి.

తయారీ కేంద్రాల్లో కనీస పరిశుభ్రత ప్రమాణాలు కూడా పాటించడం లేదని అధికారులు గుర్తించారు. తుప్పు పట్టిన యంత్రాలు, మురికి పాత్రలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు తేలింది. కాలం చెల్లిన, సరైన లేబులింగ్ లేని వస్తువులను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. బొద్దింకలు, ఈగలు, దోమలు, ఎలుకల వ్యర్థాలు, పురుగులు ఉన్న ప్రాంతాల్లోనే ఉత్పత్తుల తయారీ సాగుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. మురుగునీరు నిలిచిన నేలలు, బూజు పట్టిన గోడలు, గాలి, వెలుతురు సరిగా లేని గదుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

సిబ్బంది ఆరోగ్య వివరాలు, పెస్ట్ కంట్రోల్ నివేదికలు, నీటి నాణ్యత పరీక్షలకు సంబంధించిన రికార్డులు కూడా అందుబాటులో లేవని అధికారులు గుర్తించారు. కార్మికులు హెయిర్ నెట్స్, ఆప్రాన్లు, గ్లౌజులు ధరించకుండా విధులు నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ లోపాలను తీవ్రంగా పరిగణించిన అధికారులు తొమ్మిది సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను సస్పెండ్ చేసి, ఉత్పత్తి, విక్రయ కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించారు.

లైసెన్సులు సస్పెండైన సంస్థల్లో వరంగల్‌కు చెందిన హరిప్రియ ప్రొడక్ట్స్, దయానంద్ ఐస్‌క్రీమ్స్, రాజు ఘీ స్వీట్ హౌస్, శ్రీకృష్ణ ఆయిల్ మిల్స్, మట్టెవాడ రమేష్ ఇండస్ట్రీస్, జియాన్ ఫుడ్ ప్రొడక్ట్స్ (వెల్ మార్క్), గొరైకుంట కృపా బేకరీ ప్రొడక్ట్స్, హనుమకొండకు చెందిన కపిల్ ఫుడ్స్, షాద్‌నగర్ చాతన్‌పల్లిలోని శ్రీ ఎస్ఎంపీ డెయిరీ ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన రూ.5,89,550 విలువైన 5,555 కిలోల ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. కల్తీ జరిగిందనే అనుమానంతో 21 నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించారు. మరో తొమ్మిది సంస్థలైన గంగా ఫుడ్ టెక్, జీపీఆర్ ఫుడ్స్, హెల్తీ హార్ట్ ఫుడ్స్, వర్షా స్పైసెస్, కరణి స్పైసెస్, మిఠాయివాలా, బెల్ బ్రాండ్, స్వాగత్ స్వీట్స్, మార్లూస్ ఫుడ్ అండ్ బెవరేజెస్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇక లక్ష్మి ఫుడ్స్ (తిమ్మాపూర్), శివ తార ఫ్లోర్ మిల్ (వరంగల్) లో గుర్తించిన లోపాలను సరిచేసుకోవాలని ఆదేశిస్తూ ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు ఇచ్చారు. నిబంధనలు పాటించని సంస్థలపై తదుపరి చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.



ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు.

రూ.84,790 కోట్లతో నగరాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతోపాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యక్రమాలు కనిపిస్తాయని చెప్పారు. హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీ పునరుజ్జీవంతో నగరానికి కొత్త ఆభరణం

మూసీ నదిని మురికి కూపం నుంచి స్వచ్ఛమైన జలాలతో ప్రవహించే నదిగా మార్చి హైదరాబాద్‌కు గొప్ప ఆస్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలు తమ మధ్యలో ప్రవహించే నదులను శుద్ధి చేసి పర్యాటక, ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకున్నాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తొలి దశలో సుమారు రూ.7,500 కోట్ల పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. మూసీలోకి మురుగు నీరు చేరకుండా నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద ఒకేసారి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎస్టీపీల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలు, ఉద్యానవనాల నిర్వహణకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. మూసీ నది భవిష్యత్తులో హైదరాబాద్‌కు అతిపెద్ద ఆభరణంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీతో అభవృద్ధికి నూతన దిశ

సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని భట్టి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉంచుతూ నగర నిర్మాణం చేపట్టడం దేశంలోనే ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి అవసరమైన నీటి వనరుల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తీసుకొచ్చే ప్రణాళికలు హైదరాబాద్ విస్తరణకు దోహదపడ్డాయని గుర్తుచేశారు.

కాలుష్య నియంత్రణకు హిల్ట్ పాలసీ

హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజా రవాణాలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంతోపాటు ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీతో కూడిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక రవాణా వ్యవస్థల సమన్వయంతో హైదరాబాద్‌ను మరింత నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.93 వేల కోట్లు

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాలుగు వరుసల రహదారులు, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగరాభివృద్ధితో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

నిర్మాణ రంగానికి అవసరమైన నైపుణ్య మానవ వనరులు

రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి తరగతులు కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసిన యువతకు పరిశ్రమల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ?రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని, ఆధునిక యంత్రాలు, నిర్మాణ రంగ సాంకేతికతలపై యువతకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, ప్రతిభ కలిగిన యువతను ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి అందించేందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నగరంలో లగ్జరీ గృహాలతోపాటు పేద, మధ్యతర గతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లు నిర్మించే అంశంపై కూడా దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలకు సూచించారు. గతంలో హౌసింగ్ బోర్డు ద్వారా నిర్మించిన ఎంఐజీ, ఎలఐజీ గృహాలు అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాయని గుర్తు చేశారు. అదే తరహాలో దీర్ఘకాలిక ప్రణాళికతో అందుబాటు గృహ నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగ ప్రతినిధులు భాగస్వాములై సంపద సృష్టి కర్తలుగా ముందుకు రావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

విద్యుత్ ఉద్యోగులకు డీఏ, డీఆర్ పెంపు

- **విద్యుత్తు సంస్థల సీఎండీలను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి**
- **19.272 నుంచి 21.815 శాతానికి పెంపు.. జూలై 1 నుంచి వర్తింపు**
- **71,360 మందికి ప్రయోజనం.. నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం**



హైదరాబాద్, అక్టోబర్ 30 :

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి చెల్లించే కరువు భత్యం(డీఏ), కరువు ఉపశమనం(డీఆర్) పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలను ఆదేశించారు. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ, డీఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది. కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డీఏ, డీఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

మ్యాప్‌లుచూడండి

సంస్థల వారీగా లబ్ధిదారులు ఇలా

టీజీ ట్రాన్స్‌కో పరిధిలో 3,081మంది ఉద్యోగులు, 3,644మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,194 మందికి ప్రయోజనం కలగనుంది. టీజీ జెన్‌కోలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు కలిపి 14,167 మంది లబ్ధి పొందనున్నారు. టీజీ ఎస్పీడీసీఎల్‌లో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు కలిపి 28,481 మందికి, టీజీ ఎన్పీడీసీఎల్‌లో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు కలిపి 19,518 మందికి ప్రయోజనం చేకూరనుంది.ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, విద్యుత్ సంస్థల సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగానే ఈ డీఏ, డీఆర్ పెంచాలని ఆదేశాలు ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

సింగరేణి కార్మికులకు మరో శుభవార్త

సింగరేణి భవన్, అక్టోబరు 30 :

ఇటీవలే లాభాల వాటా బోనస్ (దసరా బోనస్)ను అందుకున్న సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురు చెప్పింది. నవంబర్ 5వ తేదీన దీపావళి బోనస్ ను చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్ (దీపావళి బోనస్)ను నవంబర్ 5వ తేదీన చెల్లించాల్సిందిగా సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. బోనస్‌గా రూ.419 కోట్లను చెల్లించనున్నట్లు, ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,10,250 చొప్పున దీపావళి బోనస్ చెల్లించనున్నట్లు వివరించారు. రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ అభివృద్ధి విస్తరణకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. లాభాల వాటా కింద ఈ నెలలో దాదాపు రూ.600 కోట్లT చెల్లించగా తాజాగా రూ.419 కోట్ల దీపావళి బోనస్ చెల్లించబోతున్నట్లు తెలిపారు. బొగ్గు రంగంలో పోటీని అధిగమించేందుకు బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలపై సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంబంధిత పర్సనల్, ఫైనాన్సు అధికారులతో మాట్లాడి నవంబర్ 5న దీపావళి బోనస్‌ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో చెల్లింపునకు తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగులకు వర్తింపు

దీపావళి బోనస్ కింద సగటున ఒక్కొక్క కార్మికుడికి ఈ సారి రూ.1,10,250లు అందనున్నాయి. ఈ బోనస్ కేవలం ఎన్‌సీడబ్ల్యూఎ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఇది అధికారులకు వర్తించదు. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్ కాస్ట్, సర్ఫేస్ విభాగాల్లో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయిలో బోనస్ అందుతుంది. అంతకంటే తక్కువ పని దినాల హాజరు కలవారికి వారు పని చేసిన కాలానికి నిష్పత్తి ప్రకారం బోనస్‌ను లెక్క కట్టి చెల్లించనున్నారు. అయితే ఈ బోనస్ పొందడానికి కనీస అర్హతగా గత ఆర్థిక సంవత్సరంలో ఏ కార్మికుడైనా కనీసం 30 రోజులు పని చేసి ఉండాలని నిర్ణయించారు. మొత్తం మీద సుమారు 38,000మంది ఉద్యోగులకు ఈ బోనస్ వర్తించనుంది.నెల రోజుల వ్యవధిలోనే దసరా, దీపావళి బోనస్‌ల రూపంలో సగటున దాదాపు రూ.2,65,000ను కార్మికులు అందుకోబోతున్నారు. సింగరేణి యాజమాన్యం ఈ రెండు బోనస్ లతో కలిపి ఒక్కో కార్మికుడికి సుమారు రూ.1,020 కోట్లను చెల్లించింది. ఈ నేపథ్యంలో సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సింగరేణి ఉద్యోగులకు తన దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్మికులు బోనస్‌ల సొమ్మును తమ కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని, అవకాశం ఉంటే పొదుపు చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ పండుగల స్ఫూర్తితో ఉత్సాహంగా పనిచేయాలని గనుల వారీగా, శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు.



గ్లోబల్ ఐటీ & ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్

- **పోచారంలో రూ.600 కోట్లతో ఇన్ఫోసిస్ నూతన డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం**

హైదరాబాద్, అక్టోబర్ 30 :

పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక కేంద్రంగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని పోచారం ఇన్ఫోసిస్ ప్రాంగణంలో రూ.600 కోట్ల వ్యయంతో 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నూతన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి భవనాన్ని (10,000 సీట్ల సామర్థ్యం) శుక్రవారం వారు కలసి ప్రారంభించారు.

హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థల విశ్వాసం: డిప్యూటీ సీఎం భట్టి

నగరంలో ఇప్పటికే 48 వేల మందికి పైగా ఉద్యోగులతో సేవలు అందిస్తున్న ఇన్ఫోసిస్, మరో 10 లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని అందుబాటులోకి తేవడం హైదరాబాద్‌పై ఆ సంస్థకున్న నమ్మకానికి ప్రతీక అని భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత విస్తరిస్తున్న తరుణంలో యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం అందించాలన్నారు. పరిశ్రమలువిద్యాసంస్థల మధ్య అనుసంధానం పెంచి, జిల్లాల్లోని కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ఐటీ రంగంలో సమాన అవకాశాలు కల్పించాలని ఇన్ఫోసిస్ యాజమాన్యాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేగవంతమైన పరిపాలన, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా మరియు పర్యావరణహిత అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం: మంత్రి శ్రీధర్ బాబు

పోచారంలో 450 ఎకరాల్లో విస్తరించిన ఇన్ఫోసిస్ ప్రాంగణ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.3,200 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారని, కొత్త సెంటర్ రాకతో గ్లోబల్ ఐటీ రంగంలో హైదరాబాద్ స్థానం మరింత బలపడుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇంజినీరింగ్ సేవలు భవిష్యత్తు ఐటీ వృద్ధికి కీలకంగా మారతాయని వెల్లడించారు. కొత్త భవనంలో రేడియంట్ కూలింగ్ వ్యవస్థ, స్మార్ట్ లైటింగ్, వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి పునర్వినియోగం మరియు సహజ కాంతి వినియోగం వంటి పర్యావరణహిత వసతులు కల్పించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘరాజ్కా, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్లు సునీల్ కుమార్ ధారేశ్వర్, రాజనీష్ మాల్వియా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నిలాద్రి ప్రసాద్ మిశ్రా, డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ ప్రణబ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానివే

మొదటిపేజీ తరువాయి

తెలిపారు.

కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్ కలిసి మియాపూర్ భూములను కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారని సీఎం ఆరోపించారు. ఈ వ్యవహారంలో దామోదర్‌రావుకు విలాసవంతమైన కార్లను లంచంగా ఇచ్చారని, కేసీఆర్‌కు నగదు రూపంలో ముడుపులు అందాయని విమర్శించారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా విలువైన భూములను కబ్జా చేసేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడినట్లు వెల్లడించారు.

కబ్జాలపై న్యాయపోరాటం

కేటీఆర్ బలేరావు కుటుంబ సభ్యులతో కుమ్మక్కై ఐఎంజీ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా న్యాయపోరాటంతో అడ్డుకున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామన్నారు. గుర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు ఆక్రమించేందుకు యత్నించగా సుప్రీంకోర్టులో పోరాడి అవి అటవీ భూములేనని నిర్ధారించామని చెప్పారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆ భూములను కాపాడి పోలీసుల పిల్లల కోసం పాఠశాల నిర్మించినట్లు వివరించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా ఇచ్చిన 400 ఎకరాల అటవీ భూమిని సుప్రీంకోర్టులో పోరాడి దక్కించుకున్నామని సీఎం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ భూఆక్రమణలను అడ్డుకున్నామన్నారు. హరీశ్‌రావు మామ హనుమంతరావు ఆక్రమించుకున్న భూముల సర్వేను అడ్డుకోవడంతోపాటు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్‌రావు అధికారంలోకి వచ్చాక వాటిని స్వాధీనం చేసుకోకుండా లాలూచీ పడ్డారని ఆరోపించారు.



విక్రయ ఆదాయం అభవృద్ధికి

మియాపూర్ సహా ప్రభుత్వం పరిరక్షించిన భూముల విక్రయం, నిధుల సమీకరణపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. భూముల విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని నీటిపారుదల, విద్య, వైద్య రంగాలకు, ముఖ్యంగా విద్యాభివృద్ధికి కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై మంత్రివర్గంలో చర్చిస్తామన్నారు. సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చినా బీఆర్ఎస్ నేతలు స్పందించకపోవడం, రెవెన్యూ అధికారులను అభినందించకపోవడం వారి వైఖరికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో భూముల అంశంపై చర్చకు వస్తే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భూఆక్రమణలపై చర్చించేందుకు ప్రతిపక్షాలు ధైర్యంగా అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ రెండు గ్రామాల మధ్య వివాదాన్ని తనకు అనుకూలంగా మలచుకున్నారని ఆరోపించారు. అక్కడి ఆక్రమణలను తొలగించి శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తామని ప్రకటించారు. కోర్టు తీర్పులనైనా గమనించి కేసీఆర్, కేటీఆర్ భూఆక్రమణలు మానుకోవాలని, మియాపూర్ భూములపై కుట్రలకు స్వస్తి పలకాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రభుత్వం మరో మానవీయ నిర్ణయం

- **ఇక అన్ని సామాజిక భద్రతా పింఛన్లలోనూ ఇన్‌స్టంట్ పెన్షన్ సదుపాయం**

హైదరాబాద్, అక్టోబర్ 30ః

సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం మరొక కీలక మానవీయ నిర్ణయం తీసుకుంది. పింఛన్‌దారులైన భర్తలు మరణించిన సందర్భాల్లో వారి భార్యలకు తక్షణమే సామాజిక భద్రతా పింఛన్ మంజూరు చేసే 'ఇన్‌స్టంట్ పెన్షన్' సదుపాయాన్ని మరిన్ని కేటగిరీలకు విస్తరిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి సీతక్క ఆదేశాలతో తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా అనేక పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. ఇప్పటివరకు కేవలం వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తేనే ఆయన భార్యకు ఈ ఇన్‌స్టంట్ పెన్షన్ సౌకర్యం అందుబాటులో ఉండేది. తాజాగా దీనిని దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు కూడా వర్తింపజేస్తూ విస్తరించారు. మరణించిన పింఛన్‌దారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే 'వితంతు పింఛన్' మంజూరు చేస్తారు. 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే 'వృద్ధాప్య పింఛన్' కింద తక్షణమే పింఛన్ అందజేస్తారు.

దరఖాస్తు విధానం & కావలసిన ధ్రువపత్రాలు

జీవిత భాగస్వామిని కోల్పోయిన మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలిచేందుకు దరఖాస్తు ప్రక్రియను ఎంతో సులభతరం చేశారు: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్‌కు దరఖాస్తు అందజేయాలి. భార్య ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన భర్త ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికేట్). సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలించి, 'చేయూత' పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి అర్హత ధ్రువీకరించుకున్న వెంటనే పెన్షన్ మంజూరు చేస్తారు.

సెక్రటేరియట్‌లో ఆక్టోపస్ మాక్ డ్రిల్

హైదరాబాద్, అక్టోబర్ 30:

ఆక్టోపస్ బృందం ఆధ్వర్యంలో ఆక్టోపస్ ఎకో స్వాట్ టీం ఎస్‌హెచ్‌ఓ/డీఎస్పీ బి.మరియదాసు నాయకత్వంలో వివిధ శాఖల సమన్వయంతో సచివాలయంలో శుక్రవారం ఆపరేషనల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ పోలీస్, అగ్నిమాపక శాఖ, సీఎస్‌జీ , తెలంగాణ స్పెషల్ పోలీస్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్), ట్రాఫిక్ పోలీస్, వైద్య బృందం, బాంబ్ డిస్పోజల్ బృందాలు పాల్గొన్నాయి. సచివాలయంలో ఏవైనా అనుకోని భద్రతాపరమైన ముప్పు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ భద్రతా, అత్యవసర సేవల విభాగాల సన్నద్ధత, పరస్పర సమన్వయం, స్పందనా సామర్థ్యం, కార్యాచరణ సామర్థ్యాలను అంచనా వేయడం, మరింత బలోపేతం చేయడం ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం. ఈ విన్యాసంలో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ (అసాల్ట్ కమాండర్) రఘునందన్ రావు, టీజీఎస్పీఎఫ్ సచివాలయం సీఎఉస్‌వో పి.దేవిదాస్, సచివాలయం ఏసీపీ శంకర్, ఆక్టోపస్ డీఎస్పీ రామకృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ మోహన్ రావు, టీజీఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు పవన్ కుమార్, సత్తయ్య పాల్గొన్నారు.



చమోలీలో హెలికాప్టర్ కుప్పకూలినట్లు అనుమానం

- ఫాటా నుంచి బద్రీనాథ్ వెళ్తుండగా ప్రమాదం
- ఐదుగురు ప్రయాణికులు, పైలట్ ఉన్నట్లు గుర్తింపు
- శకలాల కోసం కొనసాగుతున్న గాలింపు
- ప్రతికూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం

డెహ్రాడూన్:

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో హెలికాప్టర్ ప్రమాదం కలకలం రేపింది. జోషిమఠ్ సమీపంలోని హతి పహాడ్ వెనుక ఉన్న చాయా గ్రామ పరిసరాల్లో హెలికాప్టర్ కూలిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ప్రమాద స్థలంలో శకలాలు గుర్తించలేదు. ఘటన సమయంలో హెలికాప్టర్‌లో ఆరుగురు ఉన్నట్లు సమాచారం. వారి ప్రాణస్థితిపై ఇంకా స్పష్టత రాలేదు.

ట్రాన్స్ భారత్ కంపెనీకి చెందిన ఈ హెలికాప్టర్ ఫాటా నుంచి బద్రీనాథ్‌కు వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ప్రయాణికులను చంద్రకాంత్, రాజశ్రీ, దినేష్, ఆకాష్, అథర్వగా గుర్తించారు. పైలట్ హిమాంశుగా అధికారులు పేర్కొన్నారు.

ప్రమాద ప్రాంతంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పాటు వర్షం కురుస్తోంది. తక్కువ దృశ్యమానత కారణంగా హెలికాప్టర్ కూలిన ప్రదేశాన్ని గుర్తించడం కష్టంగా మారింది. బద్రీనాథ్, జోషిమఠ్ పరిసరాల్లో స్థానిక యంత్రాంగం, రెస్క్యూ బృందాలు గాలింపు చేపట్టాయి. సహాయక చర్యల కోసం మరో రెండు హెలికాప్టర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

హెలికాప్టర్ కూలినట్లు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ధ్రువీకరించారు. జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ శాఖ, ఎస్‌డీఆర్‌ఎఫ్ సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు క్షేమంగా బయటపడాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, అక్టోబర్‌లో చార్‌ధామ్ యాత్ర సమయంలోనూ రెండు హెలికాప్టర్లు అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. ప్రతికూల వాతావరణంతో రుద్రప్రయాగ్‌లో ఒకటి, సాంకేతిక సమస్యతో టెహ్రీలో మరొకటి అత్యవసరంగా దిగాయి.

బియ్యం ధరలు పెంచితే సహించేదిలేదు

- ఐదు శాఖల సమన్వయంతో ముమ్మర దాడులు
- ఇప్పటికే 12 కేసులు
- సరిపడ బియ్యం నిల్వలు ఉన్నాయి.. ఆందోళన చెందొద్దు
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబరు 30:

బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్‌మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించి ప్రజలపై భారం మోపినా కఠిన చర్యలు తప్పవని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా లాభాలు సంపాదించాలనుకునే వారిని ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. పెరుగుతున్న బియ్యం ధరలను అదుపులోకి తీసుకొచ్చి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు.బియ్యం ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన బేగంపేట కుందన్ బాగ్ లోని తన క్యాంపు కార్యాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో శుక్రవారం సమీక్షించారు. టోకు, చిల్లర వ్యాపారులు, రైస్‌మిల్లర్లతో పౌర సరఫరాల శాఖ అధికారులు జరిపిన చర్చల వివరాలను తెలుసుకున్నారు.అక్రమాల నిరోధానికి చేపట్టిన ప్రత్యేక చర్యలు, తనిఖీల పురోగతిని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంత్రికి వివరించారు. శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, ఇతర ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు.సాధారణంగా ప్రజలు ఎక్కువగా వినియోగించే బీపీటీ బియ్యం ధర కిలో రూ.66కు మించకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్ఎన్ఆర్ బియ్యం విషయంలో నాణ్యత, ఉత్పత్తి వ్యయాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకుని ధరపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు.అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు తదితర అవకతవకల ఆరోపణలపై ఇప్పటికే బియ్యం వ్యాపారులపై 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఐదు శాఖల సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో టోకు, చిల్లర బియ్యం మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. బేగంబజార్, నాంపల్లి, మహరాజ్‌గంజ్ సహా ప్రధాన టోకు వ్యాపార కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

గ్యాస్ కొరతపై తప్పుడు ప్రచారం

- ఎరువులు, వంటగ్యాస్ కొరతపై ప్రతిపక్షాలది దుష్ప్రచారమన్న మోదీ
- రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని విమర్శ
- రైతులపై భారం పడకుండా ఎరువుల ధరల నియంత్రణకు చర్యలు
- 26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ
- వాతావరణ మార్పులను తట్టుకునే 3 వేల కొత్త విత్తన రకాలు

బనస్కాంత, అక్టోబర్ 30:

ఇరాన్ యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందంటూ ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. దేశం అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వానికి సహకరించాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయని ఆరోపించారు. గుజరాత్‌లోని బనస్కాంతలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

దేశ ప్రజలు అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం శ్రమిస్తుంటే.. కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం దేశం సంక్షోభంలో పడాలని కోరుకుంటున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. ఎరువులు, వంటగ్యాస్ కొరతపై పుకార్లు వ్యాప్తి చేస్తూ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. దేశ ప్రగతిలో యువత, మహిళలు, బాలికలు కీలక భాగస్వాములవుతున్నారని పేర్కొన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లలో ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ ప్రభావం భారత రైతులపై పడకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధాని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కష్టకాలంలో రైతులకు అండగా ఉంటానన్న హామీకి అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

వ్యవసాయంలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు గత 12 ఏళ్లుగా చర్యలు చేపడుతున్నామని మోదీ వెల్లడించారు. రైతులు తమ భూములకు అవసరమైన ఎరువుల రకాలు, పరిమాణాన్ని గుర్తించేందుకు సాయిల్ హెల్త్ కార్డులు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. భూసార పరీక్షల ఆధారంగా తగిన ఎరువులను వినియోగించే అవకాశం వీటి ద్వారా లభించిందన్నారు. దేశవ్యాప్తంగా 26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేలా వ్యవసాయాన్ని తీర్చిదిద్దేందుకు కొత్త విత్తన రకాలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రధాని పేర్కొన్నారు. గత కొన్నేళ్లలో దాదాపు 3 వేల కొత్త రకాల విత్తనాలను రైతులకు అందించామని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసేందుకు ఇవి దోహదపడతాయని వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో పశుపోషణ, డెయిరీ రంగాలు కీలకమని మోదీ అన్నారు. ఈ రంగాల్లో మహిళల భాగస్వామ్యం ఎంతో ప్రాధాన్యమైనదని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంగా పశుపోషణ, పాల ఉత్పత్తిలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెరుగైన పశు జాతుల అభివృద్ధి ద్వారా పాల ఉత్పత్తిని మరింత పెంచుకోవచ్చని తెలిపారు.



ఓటు హక్కు పరిరక్షణకు రాంలీలా మైదాన్‌లో ర్యాలీ

- నవంబర్ 1న ఇండియా కూటమి భారీ నిరసన కార్యక్రమం
- 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ అంచనా
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని అడ్డుకుంటున్నారని అమిత్ షాపై రాహుల్ ఆరోపణ
- మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీల ప్రయోజనాల కోసమే కుట్ర అంటూ విమర్శ
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ:

ఓటు హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నవంబర్ 1న నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సుమారు 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఢిల్లీకి చేరుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ ఆరోపణలు చేశారు.

ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని నిలువరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ర్యాలీకి ఎంతమంది వస్తున్నారు? వారిలో ఎంతమందిని అడ్డుకుంటున్నారు? అన్నది గమనిస్తే దేశంలో నెలకొన్న పరిస్థితులు అర్థమవుతాయని వ్యాఖ్యానించారు.

కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోతున్నారన్న ఆందోళన ప్రజల్లో పెరుగుతోందని, ఈ పరిణామాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని రాహుల్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, పారిశ్రామికవేత్తలు అదానీ, అంబానీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు మేలు చేకూర్చేలా ఈ పరిణామాలు ఉన్నాయని ఆరోపించారు. ఇది విడివిడిగా చేపడుతున్న నిరసనల సమాహారం కాదని, ఒకే లక్ష్యంతో సాగుతున్న ఉద్యమమని రాహుల్ స్పష్టం చేశారు. ఈ పోరాటంలో ఇండియా కూటమిలోని ప్రతిపక్ష పార్టీలన్నీ భాగస్వాములవుతాయని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసన తెలియజేయాలనుకునే ప్రతి ఒక్కరూ రాంలీలా మైదానానికి రావాలని పిలుపునిచ్చారు.



సమ్మిళిత అభివృద్ధి, సుస్థిరతతోనే లక్ష్య సాధన

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 30ః

రాష్ట్రం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనే లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన ప్రతిభ, పారిశ్రామిక సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం రాష్ట్రానికి పుష్కలంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వసరుల అభివృద్ధి సంస్థ (డాక్టర్ ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి.ఐ.) స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన “ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి, ప్రజా విధానాలు” అనే రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రచురించిన ‘సమృద్ధి’ జర్నల్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఆర్థిక వృద్ధి అనేది కేవలం స్థూల ఆర్థిక గణాంకాలు, తలసరి ఆదాయ పెరుగుదలకే పరిమితం కాకూడదని, సామాన్య ప్రజల జీవన ప్రమాణాల్లో స్పష్టమైన మార్పును తీసుకురావాలని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని విస్మరించి చేపటే అనాలోచిత పట్టణ విస్తరణ ప్రమాదకరమని హెచ్చరించారు. చెరువులు, సహజ నీటి వనరులను కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలపై తీవ్ర భారం పడుతుందన్నారు. మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక ప్రాజెక్టులు పర్యావరణ సమతుల్యత, బాధితులకు సరైన పునరావాసం ప్రాతిపదికగా ముందుకు సాగుతాయని తెలిపారు. ప్రభుత్వ శాఖల మధ్య విభాగపరమైన గోడలను తొలగించి, వ్యవసాయం, విద్యుత్, సాగునీటి శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమయాన్ని వృథా చేయకుండా వేగవంతమైన సేవలు అందించడమే పరిపాలనా సామర్థ్యానికి నిజమైన కొలమానమని పేర్కొన్నారు.

సదస్సులో ప్రముఖుల భాగస్వామ్యం

ఈ జాతీయ సదస్సులో డాక్టర్ ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి.ఐ.డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, అదనపు డైరెక్టర్ జనరల్ అనితా రామచంద్రన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ శాంతా సిన్హాతో పాటు దేశంలోని 12 రాష్ట్రాల నుంచి విచ్చేసిన సుమారు 200 మంది విద్యావేత్తలు, పరిశోధకులు మరియు విధాన నిపుణులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్య వ్యవస్థలను అవహేళన చేయడమే వారి నైజం

- మాక్ పార్లమెంట్ పేరిట కాంగ్రెస్ డ్రామాలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 30ః

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి రాజ్యాంగ వ్యవస్థలను అవమానించడమే పనిగా పెట్టుకుందని, ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్‌ను ‘మాక్ పార్లమెంట్’ పేరిట హేళన చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉపాధ్యక్షులు బండారు శాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి ఓ.ఎస్. రెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010లో లాలూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ మాక్ పార్లమెంట్ నిర్వహించినప్పుడు అప్పటి స్పీకర్ మీరా కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని, స్వయంగా సోనియా గాంధీ దానిని “ఏ మాకరీ ఆఫ్ డెమోక్రసీ” (ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే) అని తప్పుబట్టారని గుర్తుచేశారు. నాటి వ్యాఖ్యలపై నేడు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని నిలదీశారు. పండుగల రద్దీ వేళ రైల్వే నిబంధనల ప్రకారం ముందస్తు బుకింగ్ చేసుకోకుండా, తమ వైఫల్యాలను దక్షిణ మధ్య రైల్వేపై నెట్టడం క్షమించరాని చర్య అని కాంగ్రెస్ తీరును తప్పుబట్టారు.

మూసీ నిర్వాసితులకు అండ

మూసీ నది ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన రాంచందర్ రావు, సుందరీకరణ పేరిట నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా పేదల ఇళ్లు కూల్చితే సహించేది లేదని హెచ్చరించారు. బాధితులతో నేరుగా ప్రజాదర్బార్ నిర్వహించి, సమస్యలు పరిష్కరించిన తర్వాతే ముందుకెళ్లాలని డిమాండ్ చేశారు.

2న అమిత్ షా మహా పాదయాత్ర

నవంబర్ 2న హైదరాబాద్ విచ్చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనే చారిత్రక ‘మహా పాదయాత్ర’ మధ్యాహ్నం 3 గంటలకు బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై మొజాంజాహి మార్కెట్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగిస్తారని తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణపై స్పష్టత

ఎస్ఎస్ఆర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని కర్ణాటక కాంగ్రెస్ మంత్రి సతీష్ జార్కిహోళి స్వయంగా ప్రకటిస్తే, ఇక్కడ తెలంగాణ కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేయడం హాస్యాస్పదమన్నారు.

మియాపూర్ భూముల వేలం నిర్ణయం దివాకోరుతనం.

అత్యంత విలువైన మియాపూర్ 550 ఎకరాల భూములపై సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే తీర్పు వచ్చిన మరుక్షణమే ఆ భూములను వేలం వేసి అమ్మేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని సుమారు 550 ఎకరాల భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ బంధువులకు, ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి చూస్తే, సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత సుప్రీంకోర్టు ఆ భూములు ప్రభుత్వానికే చెందుతాయని తీర్పు ఇచ్చిందని, దీనిని బీజేపీ సంపూర్ణంగా స్వాగతిస్తోందన్నారు.

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా ప్రభుత్వం

తీర్పు వెలువడగానే ఏమాత్రం ఆలోచించకుండా పక్కా రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా మారిపోయి వేలం పాట వేస్తామనడం కాంగ్రెస్ దిక్కుమాలిన వైఖరికి, పరిపాలనా దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ పాలన సాగిస్తారా అని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను విక్రయించడం మూర్ఖపు నిర్ణయమని, స్థానికంగా అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ఆలోచన చేయకుండా వేలం వేయడం సరికాదన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల పోటీ:

నాడు కేసీఆర్ బంధుప్రీతి.. నేడు రేవంత్ దోపిడీ నీతి అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల ఆస్తులను కాజేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీపడుతున్నాయని ఆరోపించారు. వేలం పాట ముసుగులో భూములను తమ సొంత అనుచరులకే కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఈ భూములు రేవంత్ రెడ్డి కుటుంబానిదో, అనుచరుల జాగీరో కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఉమ్మడి ఆస్తి అని గుర్తుచేశారు. మియాపూర్ భూముల్లో ఒక్క ఇంచు స్థలం అన్యాక్రాంతమైనా చూస్తూ ఊరుకోమని, క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి వేలం పాటను ఖచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.

పార్టీలో భారీ చేరికలు

మీడియా సమావేశం అనంతరం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విశ్రాంత ఉన్నతాధికారులు, ఇంజినీర్లు బీజేపీలో చేరారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ హన్మంతరావు, ఆర్ అండ్ బీ రిటైర్డ్ ఈఈ కస్తూరి లక్ష్మీవెంకటరమణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సి.హెచ్. రమేశ్, ఎస్‌బీఐ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ వెంకటేశం గుప్తా, మాజీ వైశ్య సంఘం అధ్యక్షుడు భూమలింగం గుప్తాతోపాటు పలువురు ప్రముఖులకు రామచందర్ రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



దళారుల బారిన పడి రైతులు నష్టపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి

శెనార్తి మీడియా, బెజ్జంకి:



రైతులు దళారుల ప్రలోభాలకు లోను కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. శనివారం బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి, దాచారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల ద్వారా మద్దతు ధరను పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఎండ నుంచి ఉపశమనం కలిగేలా టెంట్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేయడంతో పాటు ధాన్యం సేకరణలో ఎలాంటి జాప్యం జరగ కుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, ఏఎంసీ చైర్మన్ మాతంగి శిరీష అనిల్, సర్పంచులు బైర మానస సంతోష్, నేరేళ్ల వెంకట లక్ష్మీ రాజయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పర్ష సంతోష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఒంటెల సంపత్ రెడ్డి, పులి కృష్ణ, చిలువేరి శ్రీనివాస్ రెడ్డి, గండికోట సురేష్, కుంట హరికృష్ణ, కుక్కల రాములు, మాతంగి భాస్కర్, మెండే నవీన్, జెల్ల ప్రభాకర్, గుర్రం రాజిరెడ్డి, పలువురు డైరెక్టర్లు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన మహిళలు పాల్గొన్నారు.

బోర్ వెల్ రీచార్జ్ పనులతో మోడల్ విలేజ్ గా హిమ్మత్ నగర్

- మండలంలోనే తొలిసారిగా పనులు పూర్తి

శెనార్తి మీడియా, గంగాధర:

భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన బోర్‌వెల్ రీచార్జ్ పనులను విజయవంతంగా పూర్తి చేసుకుని గంగాధర మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామం ఆదర్శంగా నిలిచింది. ఈ తరహా పనులను మండలంలోనే తొలిసారిగా పూర్తి చేసిన గ్రామంగా గుర్తింపు పొందింది. గ్రామ సర్పంచ్ బీర్ల ఆనందం ఆధ్వర్యంలో అక్టోబర్ 24న ప్రారంభించిన రీచార్జ్ పనులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నీటి కొరత ఎదురుకాకుండా ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. బోర్‌వెల్ రీచార్జ్ విధానంతో వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలమట్టాలను పెంచుకోవచ్చని వివరించారు. గ్రామంలో నీటి ఎద్దడి నివారించేందుకు ఇలాంటి చర్యలు దోహదపడతాయని, నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్ఞానేశ్వరి, జేఈ సత్యం ప్రకాష్, కార్యదర్శి మమత, ఉప సర్పంచ్ వెంకటేష్, ఎఫ్ఏ పద్మ పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

శెనార్తి మీడియా, కొత్తగూడెం: ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవికుమార్ విమర్శించారు. శనివారం కొత్తగూడెం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎస్ఐఆర్ ద్వారా దొంగ ఓట్లు, నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లను తొలగించి ఓటరు జాబితాను ప్రక్షాళన చేస్తారని తెలిపారు. దీనివల్ల ఎన్నికల్లో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.

అండర్–19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు 'తేజస్' ఎంపిక

శెనార్తిమీడియా, కొత్తపల్లి :



కొత్తపల్లి పట్టణంలోని తేజస్ జూనియర్ , డిఫెన్స్ కాలేజీకి చెందిన విద్యార్థి కె.అభిషేక్ అండర్–19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కాలేజీ చైర్మన్ సతీష్ రావు తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన అండర్–19 క్రికెట్ సెలక్షన్స్ లో అభిషేక్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు తరఫున అభిషేక్ ఆడతారని చెప్పారు. ఈ సందర్భంగా అభిషేక్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

స్మార్ట్ కార్డులో ఊరినే మార్చేశారు..

- కొత్త రేషన్ కార్డుల్లో మారిన గ్రామం పేరు
- లబ్ధిదారుల ఆందోళన
- సవరించాలని డిమాండ్

శెనార్తి మీడియా, శంకరపట్నం:



శంకరపట్నం మండలం వంకాయ గూడెం గ్రామానికి జారీ చేసిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల్లో గ్రామం పేరే మారిపోవడం కలకలం రేపుతోంది. దాదాపు 40 ఏళ్లుగా ప్రత్యేక గ్రామపంచాయతీగా కొనసాగుతున్న వంకాయగూడెం పేరుకు బదులుగా కార్డుల్లో రెవెన్యూ గ్రామం కేశవపట్నం అని నమోదు చేయడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం గ్రామపంచాయతీలో స్మార్ట్ కార్డులు అందుకున్న గ్రామస్థులు ఈ పొరపాటును గుర్తించారు. ప్రత్యేక గ్రామపంచాయతీగా వంకాయ గూడెం కొనసాగుతున్నప్పుడు కొత్త కార్డుల్లోనూ అదే పేరు ఉండాల్సిందని వారు అభిప్రాయపడుతున్నారు. తమ గ్రామం పేరును మార్చి కేశవపట్నంగా నమోదు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కార్డుల్లో చోటుచేసుకున్న తప్పులను సరిచేయాలని, వంకాయ గూడెం పేరుతోనే కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.


కోతులు అడ్డురావడంతో అదుపు తప్పిన బైక్

- ఇద్దరికి గాయాలు 108లో ఆస్పత్రికి తరలింపు

శెనార్తి మీడియా, శంకరపట్నం (తిమ్మాపూర్):



మార్గమధ్యలో కోతులు అడ్డురావడంతో అదుపుతప్పిన ద్విచక్రవాహనం ప్రమాదాని కి గురై తాత, మనవడు గాయపడ్డారు. ఈ ఘటన తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలం పల్లి గ్రామానికి చెందిన చిప్ప బత్తుల పాప య్య (80) తన మనవడు అనిల్ (30)తో కలిసి బ్యాంకు పని నిమిత్తం మాన కొండూరుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో మల్లాపూర్ శివారులో ఒక్కసారిగా కోతులు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పాపయ్య తలకు, ఎడమ చేతి మణికట్టు వద్ద తీవ్ర గాయాలయ్యాయి. అనిల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఈఎంటీ గూడూరి సతీష్ రెడ్డి, పైలట్ ఆర్సీ రెడ్డి క్షతగాత్రులకు అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.





రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

శెనార్తి మీడియా, శంకరపట్నం: కేశవపట్నంలో శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాల పాలై మృతిచెం దాడు. ఈ ప్రమాదంలో కేశవపట్నంలో జీవ నోపాధి పొందుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అద్దంకి శ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన బొజ్జ అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను కరీంనగర్ లోని ఓ దవాఖానకు చికిత్స కోసం తరలిస్తుండగా, శ్రీనివాస్ (21) మరణించాడు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

- ఐదుగురు అరెస్ట్..
- బైకులు, సెల్ ఫోన్లు, నగదు స్వాధీనం

శెనార్తి మీడియా, శంకరపట్నం:

కేశవపట్నంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ ఘటనలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు, 11350 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులతో పాటు స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ కోసం కేశవపట్నం పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సురేంద్ర పాల్ సింగ్, మల్లేష్, కానిస్టేబుల్ సాయి దీప్ పాల్గొన్నారు.

రిమ్స్ లో పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి



ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :

రిమ్స్ ఆసుపత్రిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, సివిల్, విద్యుత్, ఆక్సిజన్ పైప్‌లైన్ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక వసతులు కల్పించడంతో పాటు పారిశుద్ధ్యం, రోగుల సంరక్షణ, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నిరుపయోగమైన పాత సామగ్రి, స్క్రాప్‌ను నిబంధనల ప్రకారం తొలగించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

షార్ట్ ఫిల్మ్ పోటీల్లో పోలీసు అధికారుల ప్రతిభ

- విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన కలెక్టర్, ఎస్పీ

శెనార్తి మీడియా, వికారాబాద్:

పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీస్ అధికారులకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ పోటీల్లో యాలాల్ పోలీస్ స్టేషన్ ఎస్సై విఠల్ రెడ్డి ప్రథమ బహుమతి, పెద్దేముల్ పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ ద్వితీయ బహుమతి, నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎస్సై గిరి తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు, సేవలు, ప్రజల పట్ల వారి బాధ్యతలను గుర్తుచేసుకోవడానికి పోలీస్ ఫ్లాగ్ డే ఒక ముఖ్యమైన సందర్భమని పేర్కొన్నారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేందుకు షార్ట్ ఫిల్మ్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల సేవానిరతి, క్రమశిక్షణ, అంకితభావాన్ని ఫ్లాగ్ డే కార్యక్రమాలు ప్రతిబింబిస్తాయని అన్నారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల రక్షణ, రోడ్డు భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుత్తూర్, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, ఈఈ (పీఆర్) ఉమేష్ కుమార్, డీపీవో జయసుధ, వైద్య అధికారి చంద్రశేఖర్, డీఎస్పీలు, సీఐలు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు



వర్షంలోనూ కదలని జనం..

- డంపింగ్ యార్డ్ పై పోరాట పటిమ
- నాలుగు రోజుల జన సంకల్ప యాత్రకు బాలాజీనగర్ లో ముగింపు


శెనార్తి మీడియా, జవహర్ నగర్ :

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం చేపట్టిన నాలుగు రోజుల 'జన సంకల్ప యాత్ర' బాలాజీనగర్‌లో నిర్వహించిన ముగింపు సభతో ముగిసింది. సభ జరుగుతున్న సమయంలో భారీ వర్షం కురిసినా ప్రజలు వెనుదిరగలేదు. కుర్చీలను తలపై అడ్డుగా పెట్టుకుని వర్షంలో తడుస్తూనే ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. ప్రజల ఈ పట్టుదల సభలో ప్రత్యేకంగా నిలిచింది. సాధారణంగా వర్షం కురిస్తే బహిరంగ సభలకు హాజరైనవారు వెళ్లిపోతుంటారు. అయితే జవహర్‌నగర్‌లో ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపించింది. డంపింగ్ యార్డ్ కారణంగా ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు, బాధితులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సభ ముగిసే వరకు అక్కడే ఉన్నారు. తమ ప్రాంత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలన్న ప్రజల ఆకాంక్షకు ఇది ప్రతిబింబంగా నిలిచింది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో సాగిన ఈ యాత్రకు నాలుగు రోజుల పాటు డంపింగ్ యార్డ్ బాధితులు, స్థానిక ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మద్దతుగా నిలిచారు. ముగింపు సభలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీలు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ప్రతికూల వాతావరణంలోనూ ప్రజలు చూపిన ఆదరణ తమపై బాధ్యతను మరింత పెంచిందని నాయకులు పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రభుత్వంపై బాధితుల ప్రశ్నలు

డంపింగ్ యార్డ్ సమస్యపై స్థానికుల్లో నెలకొన్న ఆగ్రహం, ఆందోళన ఈ సభతో మరోసారి వెలుగులోకి వచ్చాయి. ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుంది? తక్షణ ఉపశమన చర్యలు ఎప్పటి నుంచి అమలవుతాయన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. సభలో ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఎండ, వానతో సంబంధం లేకుండా డంపింగ్ యార్డ్ తొలగించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం విరమించబోమని స్పష్టం చేశారు. నాలుగు రోజుల యాత్ర ముగిసినప్పటికీ ఉద్యమం ఆగదని నాయకులు స్పష్టం చేశారు. సభలో ప్రసంగాల కంటే వర్షంలోనూ చివరి వరకు నిలిచిన ప్రజల సంకల్పమే ఈ పోరాట తీవ్రతను చాటిచెప్పింది.



కళ్లలో ఇన్ని రంగులా..!

కళ్ల రంగు బట్టి మీరెలాంటి వారో తెలుసుకోండి ఇలా



నేత్రేంద్రియాణం.. నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అంటే మానవుడికి ఉండే అన్ని ఇంద్రియాల్లోకి కళ్లు చాలా ముఖ్యమైనవి. మానవ శరీరంలో అత్యంత సున్నితమైనవి నేత్రాలు. మనుషుల మధ్య ప్రేమానుబంధాలు కళ్లతో మొదలై హృదయాన్ని చేరుకుంటాయని అంటుంటారు. మనిషికి ప్రపంచాన్ని చూపే ఈ కళ్లు ఎంతో ముఖ్యమైనవి. అంతేనా మనలో ఆకర్షణీయంగా కనిపించే అవయవాల్లో కళ్లు మొదటి స్థానంలో ఉంటాయి. అయితే ప్రపంచంలో కేవలం నలుపు రంగు, నీలికళ్లే కాదు ఇంకా చాలా రంగుల కళ్లు ఉన్నాయి..! అవేంటో తెలుసుకుందాం.

బూడిదరంగు కళ్లు

సాధారణంగా అందరికీ పుట్టినప్పుడు కళ్లు బూడిదరంగులో ఉంటాయి. కానీ పెరిగే కొద్దీ అవి రంగు మారతాయి. కానీ కొందరికి మాత్రం పెద్దయిన తర్వాత కూడా కళ్లు అదే బూడిదరంగులో ఉంటాయి. ఈ బూడిదరంగు కళ్లు ప్రపంచంలో 3 శాతం మందికి ఉంటాయి. కనుపాప రంగుకు కారణమయ్యే మెలనిన్ అనే వర్ణద్రవ్యం తక్కువ మొత్తం ఉండటం, కంటిలోని స్ట్రోమా భాగంలో కొలాజిన్ ప్రొటీన్ ఎక్కువగా ఉండటంతో కనుపాప నీలిరంగులోకి మారకుండా అడ్డంకి ఏర్పడుతుందట. ఫలితంగా కనుపాప బూడిద రంగులో కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ రంగు కళ్లున్నవాళ్లు ఎక్కువగా ఉత్తర, తూర్పు యూరప్‌లో ఉంటారు. అయితే బూడిద రంగు కళ్లు గల వారిలో హుందాతనం మూర్తీభవించి ఉంటుంది. ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంటారు. చేయాలనుకున్నదాన్ని చేసుకుంటూ వెళ్లిపోయే రకం. ప్రేమ, రొమాన్స్ తదితరాలకు ఎక్కువ విలువనిస్తారు. మానసికంగా బలంగా ఉంటూ, పరిస్థితులను విశ్లేషించి కష్టకాలం నుంచి నెట్టుకు వచ్చేస్తారు.



నీలం రంగు కళ్లు

ప్రపంచంలో 8 నుంచి 10 శాతం మందికి నీలిరంగు కళ్లు ఉంటాయి. యూరప్‌లో అందులోనూ ముఖ్యంగా స్కాండినేవియాలో వీళ్లు అధికం. వీరి కనుపాప రంగు పాక్షికంగా తల్లిదండ్రుల జన్యువు నుంచి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. నీలిరంగు కళ్లున్న వ్యక్తులు చీకటిలోనూ చూడగలరట. అయితే పగటి పూట సూర్యకాంతిని తట్టుకోలేరని నిపుణులు చెబుతున్నారు. అయితే.. నీలి రంగు కళ్లు గల వారు శాంత స్వభావులుగా ఉంటారు. చాలా స్మార్ట్‌గా ఉంటూ ఇతరులను ఆకర్షిస్తారు. వారు దీర్ఘకాల బంధాన్ని కొనసాగిస్తారని నిపుణులు చెబుతున్నారు.

నలుపు రంగు కళ్లు

ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది కనుపాపలు నలుపు రంగులో ఉంటాయి. నిజానికి అది నలుపు కాదు.. గోధుమ రంగు. మెలనిన్ అనే వర్ణద్రవ్యం ఎక్కువగా ఉన్నవాళ్ల కళ్లు నలుపుగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే నల్ల రంగు కళ్లు రహస్యాన్ని సూచిస్తాయని నిపుణులు అంటున్నారు. వీరిది కష్టపడి పని చేసే తత్వం. బాధ్యతాయుతంగా ఉండటమే కాదు.. పని ఎంత కష్టమైనా.. చేయడంలో ఒక అడుగు ముందుంటారు. భవిష్యత్తు గురించి ఆలోచించకుండా ప్రెజెంట్‌లో జీవించే వ్యక్తిత్వం వీరిది.

లేత ఆకుపచ్చ కళ్లు

ప్రపంచ జనాభాలో 2శాతం మంది కళ్లు ఆకుపచ్చ రంగులో ఉంటాయంటా. ఉత్తర, మధ్య, పశ్చిమ యూరప్‌లో ఆకుపచ్చ కళ్లు ఉన్న వ్యక్తులు ఎక్కువ. వీరిలో 16 శాతం సెల్టిక్, జర్మన్ల వారసులై ఉంటారని అంచనా. ఐర్లాండ్, స్కాట్లాండ్‌లో 86 శాతం మంది నీలి, ఆకుపచ్చ రంగు కళ్లున్నవారు ఉన్నారు. ఈ వ్యక్తులు ఇతరులకన్నా ఆకర్షణీయంగా కనిపిస్తారు. అందంలోనే కాదు మేధస్సులోనూ వీరిని ఎవ్వరూ ఓడించలేరు. తమ తెలివితేటలతో ఇతరుల మెప్పు పొందుతారు.

బంగారు బల్లి విశిష్టత ఇదే...



కొన్నాళ్లకు వారికి శాప విముక్తి కలిగి మోక్షం లభించింది. ఈ సమయంలో సూర్య, చంద్రులు సాక్ష్యంగా ఉన్నారని, శాపవిమోచనం అనంతరం శిష్యులిద్దరి శరీరాలు బంగారు, వెండి బల్లుల రూపంలో బొమ్మలుగా ఉండి భక్తులకు దోషనివారణ చేస్తాయని సూర్య, చంద్రులు చెప్పారు. బంగారు అంటే సూర్యుడు, వెండి అంటే చంద్రుడు అని కూడా అర్థం. అయితే దీనితో పాటుగానే.. సరస్వతీ దేవీ నుంచి శాపవిముక్తి పొందిన ఇంద్రుడు పెరుమాళ్ ఆలయంలో దీనికి గుర్తుగా ఈ బల్లి బొమ్మలను ప్రతిష్ఠించినట్టు మరో కథనం కూడా ఉంది.

బంగారు బల్లి అంటే ఎవరికైనా ఇట్టే గుర్తొచ్చేది తమిళనాడులోని కంచి కామాక్షి అమ్మవారి ఆలయం. అక్కడి ఆలయంలో బంగారు తొడుగులతో ఏర్పాటు చేసిన బల్లిని ముట్టుకుంటే దోషం పోయి ఫలితం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ విషయం తరచుగా పెద్దలు కూడా చెబుతూ ఉంటారు. అయితే ఈ బంగారు బల్లి గురించి ఒక పురాణగాథ ఉంది. అదేమిటో తెలుసుకుందాం. దీనికి సంబంధించిన పురాణగాథ ప్రకారం.. గౌతమ మహర్షి వద్ద ఇద్దరు శిష్యులు ఉండేవారు. నదీ తీరానికి వెళ్లి నీటిని తీసుకువచ్చే సమయంలో కుండలో బల్లి పడిన విషయాన్ని గుర్తించలేదు. అనంతరం దీన్ని చూసిన గౌతమమహర్షి వారిని బల్లులుగా మారిపొమ్మని శపించాడు. శాపవిముక్తి కోసం వారు ప్రార్థించగా కాంచీపురంలోని వరదరాజపెరుమాళ్ ఆలయంలో లభిస్తుందని చెప్పాడు. దీంతో వారు పెరుమాళ్ ఆలయంలోనే బల్లుల రూపంలో ఉండి స్వామివారిని ప్రార్థించారు.

అయితే, ఇటువంటి సూర్యుని తేజస్సుతో ఉండే బంగారు బల్లులు ఒకప్పుడు నిజంగానే ఉండేవి. ఈమధ్య ఇవి అంతరించిపోయాయని , ఎక్కడా కనిపించడంలేదని ఆవేదన చెందుతున్న శాస్త్రవేత్తలకు శేషాచలం కొండల్లో ఇవి చమక్కున మెరిసి కొత్త ఆశలు రేకెత్తించాయి. శేషాచలం ఏడుకొండల్లో ఇవి కనిపించాయి. రాతి గుహలే వీటి ఆవాసం. బంగారు బల్లి శాస్త్రీయ నామం కాలొడాక్టిలోడ్స్ అరీస్. ఇది రాత్రుల్లో సంచరించే నిశాచర జీవి. బంగారు వర్ణం పోలిన ముదురు పసుపు, లేత పసుపు రంగులో మెరిసినట్టు ఉంటుంది.



ఇవి 150 నుంచి 180 మిల్లీ మీటర్ల వరకు పొడవు పెరుగుతాయి. రాతి గుహలు వాటి నివాసానికి అనుకూలం. సూర్యరశ్మి పడని, వేడి తగలని ప్రదేశాల్లో కనిపిస్తాయి. సాధారణంగా చీకటి పడ్డాక గుహల సందుల నుంచి వెలికి వస్తాయి. అనుకూల వాతావరణంలో జనం చడీచప్పుడు లేనప్పుడు ఒక్కోసారి పగటి పూట కూడా బయటకు వస్తాయి. ఇవి 40 నుంచి 50 గుడ్లు పెడతాయి. సాధారణ బల్లుల కంటే గట్టిగా, వింతగా అరుస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.



అయితే ..ఇంట్లో బల్లి తిరుగుతున్నప్పుడు అది మీద పడితే ఎట్లా ? అనే అపోహ అందరికీ ఉంటుంది. అలా పడినపుడు వెంటనే కామాక్షి ఆలయంలోని బల్లిని తలుచుకొని స్నానం చేసి, ఇష్టదైనవాణ్ణి ఆరాధిస్తే దోషం పోతుందంటారు. ఏమోఇంకా దోషం ఉందేమో అనుకునేవారు కంచి అమ్మవారిని దర్శించుకొని బల్లులను తాకుతారు.



కివీస్ ప్రతీకారం..

- టీమిండియాకు భారీ పరాభవం!
- నాలుగో టీట్వంటీలో 87 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- సెంచరీతో విరుచుకుపడిన గ్లెన్ ఫిలిప్స్ (107), బ్రాస్‌వెల్ (65) హాఫ్ సెంచరీ
- 259 పరుగుల భారీ స్కోరు సాధించిన కివీస్
- 172 పరుగులకే కుప్పకూలిన భారత బ్యాటింగ్ లైనప్
- కివీస్ పేసర్ జాకబ్ డఫ్ఫీకి నాలుగు వికెట్లు



ఆక్లాండ్, అక్టోబర్ 30 : భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయి డీలాపడిన న్యూజిలాండ్ ఎట్టకేలకు సత్తా చాటింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా శుక్రవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో కివీస్ జట్టు 87 పరుగుల భారీ తేడాతో టీమిండియాను చిత్తు చేసి సిరీస్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. కివీస్ బ్యాటర్లలో గ్లెన్ ఫిలిప్స్ (49 బంతుల్లో 107; ఆరు ఫోర్లు, పది సిక్సర్లు) సుడిగాలి సెంచరీతో చెలరేగగా.. చివర్లో మైకెల్ బ్రాస్‌వెల్ (25 బంతుల్లో 65; నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం 260 పరుగుల అసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు.. కివీస్ బౌలర్ల ధాటికి ఇరవై ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 172 పరుగులకే పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అయితే, ఈ సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లు గెలిచిన భారత జట్టు ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

ఫిలిప్స్ సుడిగాలి సెంచరీ..

టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా.. కివీస్ బ్యాటర్లు ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. ఓపెనర్లు టిమ్ సైఫెర్ట్ (3) విఫలమైనా.. డారిల్ మిచెల్ (24), ఫిన్ అలెన్ (31) ధాటిగా ఆడారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. భారత బౌలర్లను ఊచకోత కోస్తూ మైదానం నలుమూలలా సిక్సర్లు, బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 49 బంతుల్లోనే పది భారీ సిక్సర్లు, ఆరు ఫోర్లతో 107 పరుగులు చేసి కెరీర్‌లో మూడో టీట్వంటీ సెంచరీ నమోదు చేశాడు. అతడికి తోడుగా మైకెల్ బ్రాస్‌వెల్ కూడా రెచ్చిపోవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. బ్రాస్‌వెల్ కేవలం 25 బంతుల్లోనే ఆరు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 65 పరుగులు చేసి ఔటయ్యాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లు తీసినప్పటికీ 48 పరుగులు సమర్పించుకున్నాడు. నితీశ్ కుమార్ రెడ్డి (1/64), ప్రిన్స్ యాదవ్ (1/49), అర్ష్‌దీప్ సింగ్ (1/38), అక్షర్ పటేల్ (1/43) ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు.

తడబడిన టీమిండియా.. డఫ్ఫీ మ్యాజిక్..

260 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టుకు ఏమాత్రం శుభారంభం దక్కలేదు. కివీస్ పేసర్ జాకబ్ డఫ్ఫీ తొలి ఓవర్‌లోనే ఓపెనర్లు సంజు శాంసన్ (4), ఇషాన్ కిషన్ (0)లను పెవిలియన్‌కు పంపి కోలుకోలేని దెబ్బతీశాడు. ఈ షాక్ నుంచి టీమిండియా చివరి వరకు కోలుకోలేకపోయింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (22), అభిషేక్ శర్మ (27), నితీశ్ కుమార్ రెడ్డి (21), నమన్ ధీర్ (28) కాసేపు క్రీజులో నిలబడినా.. భారీ షాట్లకు యత్నించి వికెట్లు పారేసుకున్నారు. మిడిలార్డర్‌లో తిలక్ వర్మ (35 బంతుల్లో 35; ఒక ఫోర్, మూడు సిక్సర్లు) కొంతసేపు ఒంటరి పోరాటం చేసినా అది జట్టును ఓటమి నుంచి రక్షించలేకపోయింది. అక్షర్ పటేల్ (7) నిరాశపరిచాడు. చివర్లో ప్రిన్స్ యాదవ్ (18 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. మొత్తంగా భారత బ్యాటర్లు ఎవరూ కనీసం హాఫ్ సెంచరీ కూడా సాధించలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫ్ఫీ కేవలం 23 పరుగులిచ్చి నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత పతనాన్ని శాసించాడు. మాథ్యూ ఫిషర్ 2, మిచెల్ సాంట్నర్ 2 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు.



చరిత్ర సృష్టించిన మనీషా

వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం

ఫైనల్లో అమెరికా రెజ్లర్‌పై అద్భుత విజయం

పసిడి గెలిచిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా సరికొత్త రికార్డు

సుశీల్ కుమార్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో రెజ్లర్

ఈ టోర్నీలో భారత్‌కు మొత్తం నాలుగు పతకాలు

ఆస్తానా, అక్టోబర్ 30 : కజకిస్థాన్ రాజధాని ఆస్తానా వేదికగా జరుగుతున్న వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్ మనీషా భన్వాలా చరిత్ర సృష్టించింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో బంగారు పతకం సాధించి అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకుంది. శుక్రవారం జరిగిన 59 కిలోల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో అమెరికాకు చెందిన అబిగైల్ నెట్టెను ఓడించి వరల్డ్ చాంపియన్‌గా అవతరించింది. దీంతో వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ చరిత్రలో స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా మనీషా సరికొత్త రికార్డు నెలకొల్పింది.

వెనుకబడినా.. అదరగొట్టింది..

ఫైనల్ పోరు ఆరంభంలో అమెరికా రెజ్లర్ అబిగైల్ దే పూర్తి ఆధిపత్యం కొనసాగింది. ఒకానొక దశలో మనీషా 0-6 పాయింట్ల తేడాతో తీవ్రంగా వెనుకబడింది. ఆ క్లిష్ట పరిస్థితుల్లో మనీషా అద్భుతంగా పుంజుకుంది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుసగా పాయింట్లు సాధిస్తూ కళ్లెం వేసింది. ఏకంగా ఎనిమిది పాయింట్లు స్కోరు చేసి చివరికి 8-6 తేడాతో సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. కళ్లు చెదిరే ప్రదర్శనతో విజయం సాధించడంతో భారత కుస్తీ అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి.

రెండో భారత రెజ్లర్‌గా..

వరల్డ్ టైటిల్ గెలిచిన రెండో భారత రెజ్లర్‌గా మనీషా చరిత్రకెక్కింది. గతంలో 2010లో జరిగిన చాంపియన్‌షిప్‌లో దిగ్గజ రెజ్లర్ సుశీల్ కుమార్ 66 కేజీల ఫ్రీస్టైల్ కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు మనీషా ఆ ఫీట్ సాధించింది. ఇక, ఈ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మనీషా గెలిచిన పసిడితో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. కాజల్, నీలమ్ రజత పతకాలు సాధించగా.. తనూ శర్మ కాంస్యం గెలుపొందింది.

జపాన్ చిత్తు.. భారత్ హ్యాట్రిక్ విక్టరీ!

- ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో జపాన్‌పై 4-1 తేడాతో ఘనవిజయం
- 150వ మ్యాచ్‌లో రెండు గోల్స్‌తో అదరగొట్టిన అభిషేక్ నైన్
- చివరి 15 నిమిషాల్లో మూడు గోల్స్‌తో చెలరేగిన టీమిండియా
- హర్మన్‌ప్రీత్, విష్ణుకాంత్ సింగ్ సూపర్ గోల్స్
- టోర్నీలో వరుసగా మూడో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానం



జలంధర్, అక్టోబర్ 30 : ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ-2026లో భారత పురుషుల హాకీ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. పంజాబ్‌లోని జలంధర్ వేదికగా శుక్రవారం జరిగిన ప్రాథమిక రౌండ్ మూడో మ్యాచ్‌లో భారత్ 4-1 గోల్స్ తేడాతో పటిష్టమైన జపాన్‌ను చిత్తు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో టోర్నీలో వరుసగా ముచ్చటగా మూడో గెలుపును సొంతం చేసుకున్న టీమిండియా పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మరోవైపు ఈ టోర్నీలో జపాన్‌కు ఇదే తొలి పరాజయం కావడం గమనార్హం.

చివరి క్షణాల్లో జపాన్ షాక్..

ఒలింపియన్ సుర్జిత్ సింగ్ హాకీ స్టేడియంలో జరిగిన ఈ పోరు ఆరంభం నుంచే ఉత్కంఠగా సాగింది. ఆట 11వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ అందించిన అద్భుతమైన పాస్‌ను అభిషేక్ నైన్ గోల్‌గా మలిచి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, మొదటి క్వార్టర్ ముగిసే చివరి క్షణాల్లో జపాన్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీనిని జపాన్ ఆటగాడు షోటా కగావా ఎంతో చాకచక్యంగా గోల్‌గా మలచడంతో స్కోరు 1-1తో సమం అయింది. ఆ తర్వాత రెండో, మూడో క్వార్టర్లలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడినా గోల్స్ నమోదు కాలేదు. జపాన్ డిఫెండర్లు అడ్డుగోడలా నిలబడి భారత దాడులను సమర్థవంతంగా అడ్డుకోవడంతో మ్యాచ్ ఎటువైపు మొగ్గుతుందోనన్న టెన్షన్ నెలకొంది.

చివరి 15 నిమిషాల్లో సునామీ..

చివరిదైన నాలుగో క్వార్టర్‌లో (ఆఖరి 15 నిమిషాల్లో) భారత ఆటగాళ్లు ఒక్కసారిగా చెలరేగిపోయారు. ఏకంగా మూడు గోల్స్ వర్షం కురిపించి జపాన్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తనకు లభించిన పెనాల్టీ కార్నర్‌ను పవర్‌ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్‌గా మలిచి భారత్‌కు 2-1 ఆధిక్యాన్ని అందించాడు. ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్‌కు ఇది ఐదో గోల్ కావడం విశేషం. ఆ వెంటనే తన 150వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న అభిషేక్ నైన్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 3-1కు పెంచాడు. ఇక, చివర్లో విష్ణుకాంత్ సింగ్ కూడా అద్భుతమైన సోలో గోల్‌తో మెరిసి భారత్ విజయాన్ని 4-1తో ఖాయం చేశాడు. అద్భుత ఫామ్‌లో ఉన్న భారత జట్టు శనివారం జరగనున్న తన తదుపరి మ్యాచ్‌లో మలేషియాతో తలపడనుంది.



సెమీస్‌లో సింధు వర్సెస్ అన్మోల్!

క్వార్టర్స్‌లో డెన్మార్క్ క్రీడాకారిణిపై సింధు ఘనవిజయం

సార్‌బ్రూకెన్ (జర్మనీ), అక్టోబర్ 30 : జర్మనీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక హైలో ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు అదరగొడుతున్నారు. మహిళల, పురుషుల సింగిల్స్ విభాగాల్లో సత్తా చాటుతూ ముందంజ వేశారు. ముఖ్యంగా మహిళల సింగిల్స్ సెమీస్‌లో భారత క్రీడాకారిణులు ఇద్దరు ముఖాముఖి తలపడనుండటం విశేషం. స్టార్ షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, యువ సంచలనం అన్మోల్ ఖర్బ్ ఇద్దరూ సెమీస్‌కు దూసుకెళ్లి ఒకరికొకరు ఢీకొట్టేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో పీవీ సింధు 21-12, 21-10 తేడాతో డెన్మార్క్‌కు చెందిన అమాలీ షుల్జ్‌పై అలవోక విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి నుంచీ స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిన సింధు.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. కేవలం 28 నిమిషాల్లోనే రెండు గేములను గెలుచుకుని సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. మరో క్వార్టర్ ఫైనల్‌లో భారత యువ క్రీడాకారిణులు అన్మోల్ ఖర్బ్, ఉన్నతి హుడా తలపడ్డారు. గంటా ఎనిమిది నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో అన్మోల్ ఖర్బ్ 21-17, 18-21, 21-16 తేడాతో ఉన్నతిపై విజయం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. దీంతో ఫైనల్ బెర్త్ కోసం పీవీ సింధు, అన్మోల్ ఖర్బ్ సెమీస్‌లో తలపడనున్నారు. ఈ మ్యాచ్‌లో ఎవరు గెలిచినా ఫైనల్‌లో భారత ప్రాతినిధ్యం ఖాయమైంది

లక్ష్యసేన్ అద్భుత కమ్‌బ్యాక్..

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ కూడా సెమీస్‌కు ముందంజ వేశాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో ఫిన్లాండ్ ఆటగాడు కల్లె కోల్జోనెన్‌పై 14-21, 21-17, 21-13 తేడాతో అద్భుత విజయం సాధించాడు. తొలి గేమ్‌ను కోల్పోయి మ్యాచ్‌లో వెనుకబడిన లక్ష్యసేన్.. ఆ తర్వాత అసాధారణంగా పుంజుకుని అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చాడు. ఆధిపత్యం ప్రదర్శిస్తూ మిగతా రెండు గేములను కైవసం చేసుకుని సెమీస్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్‌లో లక్ష్యసేన్ ఫ్రాన్స్‌కు చెందిన థోమా జూనియర్ పోపోవ్‌తో తలపడనున్నాడు.

ముంబై ఇండియన్స్ ఫీల్డింగ్ కోచ్‌గా తెలుగోడు!

టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్‌కు ఎంఐ బాధ్యతలు

ముంబై, అక్టోబర్ 30 :

వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీ సన్నాహాలు ముమ్మరం చేసింది. జట్టు కోచింగ్ స్టాఫ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసింది. ఇప్పటికే హెడ్ కోచ్‌గా మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్‌ను నియమించిన ముంబై.. శుక్రవారం కొత్త కోచింగ్ బృందాన్ని ప్రకటించింది. ఇందులో ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాద్‌కు చెందిన తెలుగు వ్యక్తి టి.దిలీప్ ఎంపిక కావడం విశేషం.

టీమిండియా విజయాల్లో కీలక పాత్ర..

దిలీప్ దాదాపు ఐదేళ్ల పాటు భారత జాతీయ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించారు. భారత్ సాధించిన 2024, 2026 టీ20 వరల్డ్ కప్‌లతో పాటు, 2025 చాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో ఆయనది కీలక పాత్ర. భారత ఆటగాళ్లు ఫీల్డింగ్‌లో మెరుగవ్వడంలో దిలీప్ కృషి ఎంతో ఉంది. ఈ ట్రాక్ రికార్డును దృష్టిలో ఉంచుకునే ముంబై ఫ్రాంచైజీ ఆయనను తమ బృందంలోకి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.



మాజీలకు పెద్దపీట..

బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పను ముంబై ఎంపిక చేసింది. బౌలింగ్ కోచ్‌లుగా న్యూజిలాండ్ మాజీ పేసర్ మిచెల్ మెక్‌క్లెనాఘన్, భారత మాజీ బౌలర్ ధవళ్ కులకర్ణిలను నియమించింది. వీరిలో దిలీప్ మినహా ఊతప్ప, మెక్‌క్లెనాఘన్, ధవళ్ కులకర్ణి గతంలో ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన వారే కావడం గమనార్హం. కాగా, గత కొన్ని సీజన్లుగా ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ముంబై జట్టు తలరాతను.. ఈ కొత్త కోచింగ్ స్టాఫ్ ఎంతవరకు మారుస్తుందో చూడాలి.



లావణీ కళాకారిణిగా శ్రద్ధా కపూర్!

విఠాబాయి బయోపిక్ 'ఈఠా' ట్రైలర్ విడుదల

ముంబై, అక్టోబర్ 30 : బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఈఠా' సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. విఠాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ కళాకారిణి ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లను ఇందులో కళ్లకు కట్టారు. ఈ పాత్ర శ్రద్ధా కెరీర్‌లోనే మైలురాయిగా నిలుస్తుందని అంచనా వేస్తున్నారు. 'ఛావా' చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎల్లమ్మ' కోసం 100 మంది కళాకారులు!



టైటిల్ సాంగ్ రికార్డింగ్ పూర్తి చేసిన డీఎస్పీ

విభిన్న సంస్కృతులకు చెందిన జానపద వాయిద్యకారులతో ప్రయోగం

హైదరాబాద్, అక్టోబర్ 30 : 'బలగం' ఫేమ్ వేణు యెల్దండి దర్శకత్వంలో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ) హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'ఎల్లమ్మ'. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన 100 మంది జానపద వాయిద్య కళాకారులతో కలిసి టైటిల్ సాంగ్ రికార్డింగ్ పూర్తి చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా చేసిన ఈ ప్రయోగం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని తెలిపారు. త్వరలోనే సినిమా మొదటి సింగిల్‌ను విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ సినిమాలో దేవి శ్రీ ప్రసాద్ 'పర్షి' అనే పాత్రలో నటిస్తూ, తానే సొంతంగా సంగీతం సమకూర్చుకుంటున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తుండగా.. హన్షిత రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురానున్నారు. 'బలగం' తర్వాత వేణు నుంచి వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకులు దీనిపై భారీ అంచనాలు పెట్టుకున్నారు.





కీర్తి సురేశ్‌కు చేదు అనుభవం!



హైదరాబాద్, అక్టోబర్ 30 :

ప్రముఖ నటి కీర్తి సురేశ్‌కు విమాన ప్రయాణంలో ఓ చేదు అనుభవం ఎదురైంది. ఇటలీలోని మిలాన్ నుంచి భర్త ఆంటోనీ తట్టిల్‌తో కలిసి ఆమె భారత్‌కు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మధ్యం మత్తులో ఉన్న ఓ ప్రయాణికుడు సెల్ఫీ కోసం ఆమెను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. అతడు కనీసం నిలబడే స్థితిలో లేకపోవడంతో కాసేపు ఆగాలని కీర్తి కోరినా వినకుండా.. వెంటనే ఫొటో దిగాల్సిందేనంటూ పట్టుబట్టాడు. ఆ ప్రయాణికుడి ప్రవర్తన మితిమీరడంతో, సాధారణంగా ఎంతో ప్రశాంతంగా ఉండే తన భర్త ఆంటోనీ సైతం గట్టిగా వార్నింగ్ ఇవ్వాల్సి వచ్చిందని కీర్తి ఓ తాజా ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. చివరకు విమాన సిబ్బంది జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారని వివరించారు. అభిమానులతో మాట్లాడటం, వారి ప్రేమను స్వీకరించడం తనకు ఎంతో ఇష్టమేనని, అయితే అభిమానం పేరుతో వ్యక్తిగత హద్దులు దాటడం, స్వేచ్ఛకు భంగం కలిగించడం ఏమాత్రం సరికాదని కీర్తి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మోహన్‌లాల్ కొత్త సినిమా షురూ!

కొచ్చిలో పూజా కార్యక్రమాలు..
ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

కొచ్చి, అక్టోబర్ 30 : మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ హీరోగా, దర్శకుడు అనూప్ సత్యన్ తెరకెక్కిస్తున్న కొత్త సినిమా కొచ్చిలో అట్టహాసంగా ప్రారంభమైంది. తాత్కాలికంగా చూ368 వర్కింగ్ టైటిల్‌తో పిలుస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాల్లో సినీ ప్రముఖులతో పాటు చిత్ర బృందం పాల్గొంది. నిర్మాత బిను జార్జ్ అలెగ్జాండర్ తల్లి జ్యోతి ప్రజ్వలన చేయగా.. తొలి షాట్‌కు మోహన్‌లాల్ స్వయంగా క్లాప్ కొట్టారు. 'వరణే అవశ్యముండ్' తర్వాత అనూప్ సత్యన్ దర్శకత్వం వహిస్తున్న రెండో సినిమా ఇది. పూర్తిస్థాయి యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో నటుడు ముకేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి మోహన్‌లాల్ నవ్వుతూ కూర్చున్నట్లుగా పోస్టర్‌ను డిజైన్ చేశారు.

అనూప్ తండ్రి, ప్రముఖ దర్శకుడు సత్యన్ అంతికాడ్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోహన్‌లాల్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సత్యన్ మొదటి సినిమా నుంచి తాజా చిత్రం వరకు కలిసే పనిచేశామని, ఇప్పుడు ఆయన కొడుకుతో ప్రయాణం కొనసాగించడం సంతోషంగా ఉందన్నారు. షెహనాద్ జలాల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. స్టంట్ శివ యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు.



Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**